# విపుల మాసపత్రిక

1977 ఫిబ్రవరిలో ఈనాడు సంస్థనుంచి ఒక వినూత్నప్రయోగంగా వెలువడిన 'విపుల' మాసపత్రిక ఇటీవలే 31 సంవత్సరాలు జయప్రదంగా పూర్తి చేసుకుంది. సరికొత్త తెలుగు కథలతో పాటు జాతీయ, అంతర్జాతీయ భాషల్లోని మంచి కథల అనువాదాల్ని ప్రచురిస్తూ- విశ్వకథావేదిక అయింది. ఎంచుకున్న ఇతర భాషా కథ అనువాదపు టనుమతికి- రచయితకి అవసరమైతే- పత్రిక కూడా సహకరించడం విశేషం. తెలుగు కథ సుసంపన్నం కావడానికీ- రచయితల ప్రేరణకీ- అప్పుడప్పుడు పోటీలు కూడా నిర్వహించే 'విపుల'లో ఇటీవల తెలుగు కథల సంఖ్య గణనీయంగా పెరగడం గమనార్హం. 'విపుల' అవగాహనకు మచ్చుగా ఫిబ్రవరి (2009) సంచిక పరిశీలిద్దాం.

ఈ సంచికలో అచ్చ తెలుగు కథలు ఐదు. ఇతర భారతీయ భాషలవి మూడు. అంతర్జాతీయ భాషలో ఒక కథ, ఒక సీరియల్ నవల. తెలుగు కథ చరిత్రపై వేదగిరి రాంబాబు వ్యాసం (పేజి 4). మంచి పాత కథని హృద్యంగా పరిచయం చేసే 'పరామర్శ'. తెలుగు కవిత (28). డిటెక్టివ్ క్విజ్ (41). 'మిస్టర్ మిరియం' పేరిట మల్లాది వెంకట కృష్ణమూర్తి హాస్యోక్తుల విలక్షణ సమాహారం (122). విలక్షణ నీతి సుధ (127). పుస్తక సమీక్ష (128). అడుగడుగునా పలకరించే కార్టూన్లు, హాస్యోక్తులు కాక, చివరి పేజీ (130)లో విలక్షణ శీర్షిక 'విపుల వినోదిని': ఇందులోని పది ప్రశ్నలకీ సమాధానమివ్వాలంటే పాఠకులు పత్రికలో రచనలన్నీ శ్రద్ధగా చదవాల్సి ఉంటుంది. సరైన జవాబిచ్చిన ఐదుగురు పాఠకులకి బహుమతులు.

వీటన్నింటి విలువా నెలకి పది రూపాయలు.